www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 23 ఫిబ్రవరి 2024 5 ఏలూరు



ఇద్దరు డిఎస్‌పిలకు స్థాన చలనం

రాష్ట్ర పోలీస్ కార్యాలయం నుంచి ఆదేశాలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రాష్ట్రవ్యాప్తంగా ఏడుగురు డిఎస్‌పిలకు స్థాన చలనం కలిగిస్తూ రాష్ట్ర పోలీస్ కార్యాలయం నుం చి గురువారం ఆదేశాలు వెలువడ్డాయి. అందులో భాగంగా ఏలూరు జిల్లాలో ఇద్దరు డిఎస్‌పిలకు స్థాన చలనం కలిగింది. ఎసిబి డిఎస్‌పిగా పనిచేస్తూ దిశ పోలీస్ స్టేషన్ ఏలూరు జిల్లా ఇన్‌ఛార్జిగా పని చేస్తున్న తుపాకుల వెంకటరత్నస్వామిని తూర్పుగోదావరి జిల్లా ఎసిబి డిఎస్‌పిగా, ఇన్‌ఛార్జి ఎస్‌సి ఎస్‌టి సెల్ డిఎస్‌పిగా నియమించారు. ప్రస్తుతం ఇంటిలిజెన్స్ డిఎస్‌పిగా పని చేస్తున్న జి.లక్ష్మయ్యను నూజివీడు డిఎ స్‌పిగా బదిలీ చేశారు. బదిలీ అయిన ఏడుగురు డిఎ స్‌పిలు ఆయా సబ్ డివిజన్‌లో విధుల్లో చేరాలని రాష్ట్ర పోలీస్ కార్యాలయం నుంచి ఆదేశాలు జారీ చేశారు.

పోస్టుల్లేవు.. సమయమూ లేదు..!

ఉమ్మడి జిల్లాలోని డిఎస్‌సి అభ్యర్థుల వేదన వర్ణనాతీతం. జిల్లాలో పరీక్ష రాసే ఉపాధ్యాయ అభ్యర్థులు వేల సంఖ్యలో ఉండగా, నోటిఫికేషన్‌లో పోస్టులు అతి తక్కువగా ఉండటంతో ఏం చేయాలో తెలిని పరిస్థితి ఒకవైపు, చదువుకునేందుకు సమయం లేకపోవడం మరోవైపు డిఎస్‌సి అభ్యర్థులను కుంగదీస్తోంది. నెలరోజుల వ్యవధిలోనే టెట్, డిఎస్‌సి పరీక్షల నిర్వహణపై మానసికంగా తల్లడిల్లుతున్నారు. పరీక్ష ఫీజు భారీగా పెంచడం అభ్యర్థులను ఆర్థికంగా ఇబ్బంది పెడుతోంది. దీంతో డిఎస్‌సి రాయాలా, వద్దా అనే మీమాంసలో అంతా సతమతమవుతున్నారు.

- డిఎస్‌సి అభ్యర్థుల బాధలు వర్ణనాతీతం
- అన్నీ కలిపి ఉమ్మడి జిల్లాలో 300 పోస్టులకు నోటిఫికేషన్
- జిల్లాలో 20 వేల మందికిపైగా ఉపాధ్యాయ అభ్యర్థులు
- నెల రోజుల వ్యవధిలోనే టెట్, డిఎస్‌సి రాయాల్సిన దుస్థితి
- సన్నద్ధతకు సమయం లేకపోవడంపై అభ్యర్థుల్లో ఆందోళన
- పరీక్ష ఫీజు పెంపు, నిర్వహణ తీరుపై డిఎస్‌సి అభ్యర్థుల ఆవేదన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వైసిపి ప్రభుత్వం నాలుగున్నరేళ్లు మౌనంగా ఉండి, ఎన్నికల ముందు ప్రకటించిన డిఎస్‌సి నోటిఫికేషన్ అభ్యర్థులను తీవ్ర వేదనకు గురిచేస్తోంది. నూతన విద్యావిధానం పేరుతో ఉపాధ్యాయులను సర్దుబాటు చేసి పోస్టులను తక్కువ చేసి నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఫిబ్రవరి 8న టెట్, 12న డిఎస్‌సి నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రభుత్వం జారీచేసిన డిఎస్‌సి నోటిఫికేషన్‌లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఎస్‌జిటి పోస్టులు 102, స్కూల్ అసిస్టెంట్ 145, ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ (టిజిటి) పోస్టులు 59 మొత్తం 306 పోస్టులకు మాత్రమే పేర్కొంది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 20 వేలకుపైగా ఉపాధ్యాయ అభ్యర్థులు ఉన్నట్లు తెలుస్తోంది. పోస్టులు తక్కువగా ఉండటంతో కష్టపడి చదివినా ఉద్యోగం వస్తుందో, లేదోననే ఆందోళన అభ్యర్థుల్లో నెలకొంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రకటించిన డిఎస్‌సి, టెట్ నిర్వహణా తేదీలు అభ్యర్థులను తీవ్ర గందరగోళంలోకి నెట్టేశాయి. టెట్ పరీక్షలు ఫిబ్రవరి 27 నుంచి మార్చి తొమ్మిదో తేదీ వరకూ జరగనుండగా, డిఎస్‌సి పరీక్షలు మార్చి 15వ తేదీ నుంచి 30వ తేదీ వరకూ జరగనున్నాయి. టెట్ పరీక్ష పాసైన వారికే డిఎస్‌సి రాసే అర్హత ఉంటుంది. అయితే ప్రభుత్వం జారీచేసిన నోటిఫికేషన్‌లో డిఎస్‌సి దరఖాస్తు తేదీలు ఫిబ్రవరి 12 నుంచి 25వ తేదీ వరకూ అని పేర్కొంది. అంటే టెట్ పరీక్షలు ఫిబ్రవరి 27 నుంచి జరగనుండగా అంతకు ముందుగానే డిఎస్‌సి దరఖాస్తుల స్వీకరణ గడువు



ముగియనుంది. టెట్ పరీక్ష పాస్ అయ్యారో, లేదో తెలియకుండానే డిఎస్‌సికి కూడా దరఖాస్తు చేసుకోవాల్సి వస్తోంది. డిఎస్‌సిలో ఒక్కో పోస్టుకు దరఖాస్తు చేసుకునేందుకు ఫీజు రూ.750గా ప్రభుత్వం నిర్ణయించింది. ఎంఎ, బిఇడి చదివిన నిరుద్యోగులు ప్రస్తుత నోటిఫికేషన్ ప్రకారం ఎస్ఎ లాంగ్వేజ్, ఎస్ఎ నాన్ లాంగ్వేజ్, పిజిటి, టిజిటి పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది. ఈ నాలుగు పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలంటే రూ.750 చొప్పున రూ.మూడు వేలు వరకూ ఖర్చవుతోంది. టెట్ రెండు పేపర్లకు మరో రూ.1500 మొత్తం కలిపి రూ4,500 పరీక్ష ఫీజుగా చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. తీరా ఫీజు చెల్లించాక టెట్ పాస్ కాకపోతే ఈ ఫీజు అంతా గంగలో పోసినట్లే అవుతుందని అభ్యర్థులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. టెట్ ఫలితాలు వచ్చే వరకూ డిఎస్‌సి దరఖాస్తు గడువును పొడిగించాలని అభ్యర్థులు కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోని పరిస్థితి నెలకొంది.

నెల రోజుల వ్యవధిలో ప్రిపరేషన్ ఎలా?

వైసిపి ప్రభుత్వం వచ్చాక ప్రతియేటా జనవరిలో జాబ్ క్యాలెండర్ ఇస్తామని, మెగా డిఎస్‌సి ప్రకటించి పోస్టులు భర్తీ చేస్తామని గత ఎన్నికల్లో ప్రకటించారు. దీంతో ఎంతోమంది ఉపాధ్యాయ అభ్యర్థులు అవనిగడ్డతోపాటు పలుప్రాంతాలకు వెళ్లి పెద్దఎత్తున సొమ్ము వెచ్చించి రెండేళ్లపాటు కోచింగ్ సెంటర్ల చుట్టూ తిరుగుతూ కష్టపడ్డారు. ప్రభుత్వం నూతన విద్యావిధానం తెరపైకి తెచ్చి ఉపాధ్యాయ పోస్టులను కుదించేసింది. దీంతో ఇక ఉపాధ్యాయ ఉద్యోగాలు రావని నిరుద్యోగులంతా ఏదోక పని చేసుకుంటున్నారు. నాలుగున్నరేళ్లు నిద్రపోయిన ప్రభుత్వం హఠాత్తుగా ఎన్నికల ముందు డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేసింది. అదీ అతి తక్కువ పోస్టులతో మాత్రమే. చదువుకునేందుకు సమయం కూడా ఇవ్వని పరిస్థితి ఉంది. రెండేళ్లుగా ఉపాధ్యాయ అభ్యర్థులంతా పుస్తకాలు పక్కన పడేసి బతుకుదెరువుకోసం పాట్లు పడుతున్నారు. ఇప్పటికిప్పుడు నోటిఫికేషన్ రావడంతో ఏంచేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. చదువుకునేందుకు సమయం లేకపోవడంతో ఏవిధంగా పరీక్షలు రాయాలో దిక్కుతోచడం లేదు. దరఖాస్తు చేస్తున్నప్పటికీ ఏఒక్క అభ్యర్థీ సంతృప్తిగా లేకుండాపోయిన పరిస్థితి ఉంది. దీంతో ఉపాధ్యాయ అభ్యర్థులు ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. డిఎస్‌సి అభ్యర్థుల బాధను మాత్రం ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

మోడీ ప్రభుత్వ దమనకాండ దారుణం

ఢిల్లీలో యువరైతు మృతిపై వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నా



ధర్నా చేస్తున్న వామపక్షాల నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

కనీస మద్దతు ధర కోసం ఢిల్లీలో ఆందోళన చేస్తున్న రైతులపై బిజెపి, మోడీ ప్రభుత్వం పోలీసు కాల్పులకు తెగబడి యువరైతు ప్రాణం బలిగొనడాన్ని నిరసిస్తూ ఏలూరులో వామపక్షాలు గురువారం ధర్నా నిర్వహించాయి. ఏలూరు పాత బస్టాండ్ సెంటర్ వద్ద సిపిఎం, సిపిఐ, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీలు ఆందోళన చేపట్టాయి. సిపిఐ, సిపిఎం నగర కార్యదర్శులు యు.హేమశంకర్, పి.కిషోర్ అధ్యక్షతన చేపట్టిన నిరసనలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, న్యూడెమోక్రసీ ఏలూరు కార్యదర్శి బద్ద వెంకట్రావు, రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్ మాట్లాడుతూ పంటలకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకురావాలని ఆందోళన చేస్తున్న అన్నదాతలపై మోడీ ప్రభుత్వం నిరంకుశత్వంగా పోలీసులచే కాల్పులు జరిపించడాన్ని ఖండించారు. కాల్పుల్లో శుబ్‌కరణ్‌సింగ్ అనే రైతు మరణించారని, 30 మందికిపైగా రైతులు గాయపడ్డారని తెలిపారు. అందరికీ అన్నం పెట్టే రైతన్నలపై మోడీ ప్రభుత్వ దమనకాండ దారుణమన్నారు. ఇప్పటికైనా రైతులతో చర్చించి వారి సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే ఎన్నికల్లో రైతులు బిజెపి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, జిల్లా నాయకులు బి.సోమయ్య, వివిధ సంఘాల జిల్లా నేతలు పిచ్చుక ఆదిశేషు, పివి.రామకృష్ణ, కొర్రి విజయలక్ష్మి, కె.రామాంజనేయులు, మావూరి శ్రీనివాసరావు, ఎం.ఇస్సాక్, ఎస్.సత్యనారాయణ, మీసాల సత్యం, జి.కోటేశ్వరరావు, కాకి నాని, ఎం.క్రాంతి, యర్రా శ్రీనివాసరావు, ముంగం అప్పారావు, మంగరాజు రాము, అప్పలరాజు, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, నేతలు కురెళ్ల వరప్రసాద్, పుప్పాల కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల నిర్వహణకు పూర్తిస్థాయి ఏర్పాట్లు

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్


మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఎస్ఎస్‌సి, ఇంటర్, టెట్, డిఎస్‌సి పరీక్షలను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ప్రశాంత వాతావరణంలో నిర్వహిం చేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు తెలిపారు. తాడేపల్లిలోని విద్యా శాఖ కార్యాలయం నుంచి గురువారం ఆయా పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ సురేష్‌కుమార్, ఇంటర్ బోర్డు కమిషనర్ సౌరబ్‌గౌర్, విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్‌తో కలిసి మంత్రి బొత్స సత్యనారాయణ సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్ఎస్‌సి, ఇంటర్, డిఎస్‌సి, టెట్ పరీక్షలకు సుమారు 50 లక్షల మంది విద్యార్థులు హాజరవుతున్నారని, వీటిని పక్కాగా నిర్వహించేందుకు అధికారులు పటిష్టమైన ప్రణాళిక రూపొందించుకోవాలని అన్నారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, విద్యార్థులు, సిబ్బందితో సహా ఎవరూ స్మార్ట్‌ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లతో రాకూడదన్నారు. ప్రశ్నాపత్రాలు లీక్ కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నామని, ప్రతి ప్రశ్నాపత్రంలో ఒక యూనిక్ కోడ్ ఉంటుందని, ఆ ప్రశ్న పత్రం ఏ అభ్యర్థిది, ఏ సెంటర్‌కి చెందిందనేది కూడా తెలుస్తుందన్నారు. ఎక్కడా మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో చేపట్టిన చర్యలపై కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ఎస్ఎస్‌సి తదితర పరీక్షల నిర్వహణ సంసిద్ధతపై ఇప్పటికే అధికారులతో సమీక్షించామన్నారు. మాస్ కాపీయింగ్ జరగకుండా ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించామని తెలిపారు. డిఇఒ ఎస్.అబ్రహం, జిల్లా పరీక్షల నిర్వహణ అసిస్టెంట్ కమిషనర్ శ్రీకాంత్, జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి ప్రభాకరరావు, రవాణా శాఖాధికారి శ్రీహరి, నగరపాలక సంస్థ హెల్తాఫీసర్ డాక్టర్ మాలతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ ద్వారా సత్వర పౌర సేవలు

జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ

ప్రజాశక్తి - ఉంగుటూరు

సచివాలయ వ్యవస్థ ద్వారా పౌర సేవలు వేగవంతం అవుతున్నాయని, దేశానికి ఆదర్శనీయంగా ఉందని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గంటా శ్రీలక్ష్మి అన్నారు. మండలంలోని నారాయణపురంలో సచివాలయం 1, 2 వేర్వేరు చోట్ల రూ.95.20 లక్షలతో నిర్మించిన శాశ్వత భవనాలను ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబుతో కలిసి ఆమె గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆమె మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలు అందించడం వల్ల అభివృద్ధి జరుగుతోందన్నారు. ఎంఎల్ఎ వాసుబాబు మాట్లాడుతూ ప్రతి ఇంట్లోనూ ఏదో ఒక ప్రభుత్వ సంక్షేమ పథకం పొందిన వారు ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో వైసిపిని తిరిగి గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి దిడ్ల అలకనంద, ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యులు కొరిపల్లి జయలక్ష్మి, ఎఎంసి మాజీ ఛైర్మన్ మరడ రమావతి, ఎంపిటిసి సభ్యులు అరివెల్లి మహాలక్ష్మి, బండారు నాగరాజు, వైసిపి మండల కన్వీనర్ మరడ మంగారావు, నాయకులు బళ్ల త్రిమూర్తులు, వైస్ ప్రెసిడెంట్ ఎం.సాంబశివరావు, వైసిపి గ్రామ అధ్యక్షుడు పైడి అరుణ్‌కుమార్, పంచాయతీ వార్డు సభ్యులు, సచివాలయ ఉద్యోగులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, వాలంటీర్లు పాల్గొన్నారు.


సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్, ఎంఎల్ఎ

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

సిఎఎల్ఎ విభాగం భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన కలెక్టర్


శంకుస్థాపన చేస్తున్న కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా కలెక్టరేట్ ఆవరణలో రూ.61 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న కాంపిటీషన్ అథారిటీ ఫర్ ల్యాండ్ అక్విజిషన్ (సిఎఎల్ఎ) విభాగం భవన నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్, జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణితో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ మాట్లాడుతూ జాతీయ రహదారుల శాఖకు సంబంధించి కాంపిటీషన్ అథారిటీ ఫర్ ల్యాండ్ అక్విజిషన్ (సిఎఎల్ఎ) విభాగం కార్యాలయం నూతన భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. భవన నిర్మాణ పనులను జిల్లా గృహ నిర్మాణ శాఖకు అప్పగించారు. భవన నిర్మాణాన్ని నిర్దేశించిన సమయంలోగా నిర్మించాలని, నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పీడీ రవికుమార్, విజిలెన్స్ ఎస్‌పి కరణంకుమార్, ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలి, డిఎస్‌పి వెంకటేశ్వరరావు, ఐసిడిఎస్ పీడీ పద్మావతి, డిఎం సివిల్ సప్లైస్ మంజుభార్గవి, గృహ నిర్మాణ శాఖ ఇఇ రమణమూర్తి, డిఇ రామకృష్ణ, కాంట్రాక్టర్ తులసీరామ్ పాల్గొన్నారు.

ఆశ్రం ఆసుపత్రిలో డి-అడిక్షన్ సెంటర్ ప్రారంభం


డి-అడిక్షన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న సూర్యచంద్రరావు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

మాదకద్రవ్యాల వినియోగాన్ని నియంత్రించడం ద్వారా డ్రగ్స్ రహిత సమాజ రూపకల్పనకు ఆశ్రం హాస్పిటల్ డి-అడిక్షన్ సెంటర్‌ను ప్రారంభించింది. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జాయింట్ డైరెక్టర్, అదనపు ఎస్‌పి నక్కా సూర్యచంద్రరావు గురువారం ఆశ్రం ఆసుపత్రిలో ఆశ్రం మెడికల్ కాలేజీ, హాస్పిటల్ మనోరోగచికిత్స విభాగం ప్రత్యేక డి-అడిక్షన్ సెంటర్‌ను ప్రారంభించారు. అన్ని రకాల మాదకద్రవ్యాల వినియోగం, వ్యసనాలను ఎదుర్కొవడానికి అవసరమైన వనరులు, మందులతో చికిత్స అందించనున్నారు. ఆల్కహాల్(మద్యం), నికోటిన్(పొగాకు), గంజాయి ఇతర మత్తు, మాదకద్రవ్యాలు, ఇతర వ్యసనాలు (సెల్ ఫోన్, జూదం) బారిన పడిన వారిని ఆయా వ్యసనాల నుంచి బయటకు తీసుకువచ్చేందుకు ఈ ప్రత్యేక డి-అడిక్షన్ సెంటర్‌లో వైద్య సేవలందిస్తారు. సేవల్లో డ్రగ్ ప్రొఫైల్, 24 గంటలు డాక్టర్, నర్సింగ్ సౌకర్యాలు రక్త పరీక్షలు, పోషకాహారం, కౌన్సెలింగ్/గ్రూప్‌థెరపీ, చాలా సహేతుకమైన ఖర్చుతో 21 రోజుల పాటు వివిధ కార్యకలాపాలు ఉంటాయి. సమాజాన్ని డ్రగ్స్ రహితంగా మార్చాలనే అంతిమ లక్ష్యంతో ఈ కేంద్రం స్థాపించినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో ఆశ్రం ఆసుపత్రి డైరెక్టర్ గోకరాజు రతీదేవి, మానసిక వైద్య విభాగం వైద్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వక్తలు

హీల్ సంస్థ సేవలు అభినందనీయం

శాంతా బయోటెక్ వ్యవస్థాపకులు, పద్మభూషణ్ అవార్డు గ్రహీత వరప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

వేలాది మంది అనాథలకు, అంధులకు, వికలాంగులకు అండగా నిలిచిన హీల్ సంస్థ సేవలు ఎంతో అభినందనీయమని శాంతా బయోటెక్ వ్యవస్థాపకులు, పద్మభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ కెఐ.వరప్రసాద్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని తోటపల్లి హీల్ ప్యారడైజ్‌లో బసవయ్య కోవెలమూడి హీల్ అడ్మినిస్ట్రేటివ్ సెంటర్‌ను దుర్గాదేవి గురువారం ప్రారంభించారు. అలేఖ్య హీల్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సెంటర్ నిర్మాణ పనులకు వేగే శ్రీనివాసరావు, వాణి చేతుల మీదుగా భూమిపూజ చేశారు. హీల్ సెంటర్ ఫర్ స్పోర్ట్స్ ఎక్సలెన్సీ భవన నిర్మాణానికి యలమంచిలి శుభాకర్ దంపతులు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో హీల్ వ్యవస్థాపక అధ్యక్షులు కోనేరు సత్యప్రసాద్, ఉపాధ్యక్షులు జిడివి.ప్రసాదరావు, కార్యదర్శి టి.లక్ష్మి, క్యాంపస్ ఛైర్మన్ పి.ధనప్రకాష్, డైరెక్టర్ టి.భాస్కర్, వైఎ.చౌదరి, చలపతిరావు, రంగప్రసాద్, సిఇఒ కె.అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

చింతలపూడిని రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతా

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సొంగా రోషన్‌కుమార్


మాట్లాడుతున్న సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి నియోజకవర్గాన్ని ఒక రోల్ మోడల్‌గా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని టిడిపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి సొంగా రోషన్‌కుమార్ అన్నారు. పట్టణం లోని టిడిపి కార్యాలయం పార్టీ కార్యకర్తలు, నాయకులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రోషన్‌కుమార్ మాట్లాడుతూ గత రెండేళ్లుగా ప్రజల్లో తిరుగుతూ వారి సమస్యలు తెలుసుకున్నానని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఎంతో కష్టపడి ఈ స్థాయికి వచ్చానని, దానిని కచ్చితంగా నిలబెట్టుకుంటానన్నారు. ప్రతి ఒక్క కార్యకర్తను, నాయకుడిని కలుపుకుని ముందుకెళ్తానన్నారు. 2024లో చింతలపూడి నియోజకవర్గంలో టిడిపి విజయం సాధించే విధంగా అందరం కలిసి కృషి చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ మాజీ కన్వీనర్, జగ్గవరపు ముత్తారెడ్డి, టిడిపి మండలాధ్యక్షులు మాటూరు వెంకటరామయ్య, నాయకులు పాల్గొన్నారు.

స్కానింగ్‌లో జాప్యాన్ని నివారించాలి

ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్లతో జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ సమీక్ష

ప్రజాశక్తి - ఏలూరు

స్థానిక జిల్లా సర్వజన ఆసుపత్రిలో ఎంఆర్ఐ స్కానింగ్‌లో జాప్యాన్ని నివారించాలని జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ఆదేశించారు. స్థానిక జెడ్‌పి కార్యాలయంలో డిఎంహెచ్‌ఒ, జిల్లా సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్లతో ఆమె గురువారం జిల్లాలో వైద్యసేవలపై సమీక్షించారు. సదరం సర్టిఫికెట్ల కోసం వచ్చేవారు వేచి ఉండేలా చేయొద్దని, ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్లలో జాప్యం ఎందుకని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆ సమస్యల పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. హాస్పటల్‌లో సెక్యూరిటీ సిబ్బంది ఎక్కువ కాలం నుంచి పని చేస్తున్నారని, వారికి ఒకేచోట విధులు కేటాయించకుండా షిఫ్టులవారీగా రొటేషన్ పద్ధతి అమలు చేయాలని సూచించారు. పోలీసు అవుట్ పోస్ట్‌లో సిబ్బందిని పెంచాలని సూచించారు. ఏరియా పోలీసు పెట్రోలింగ్ టీమ్ కూడా ఆ ప్రాంతంలో రౌండ్లు నిర్వహించాలని డిఎంహెచ్‌ఒ కోరారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ కెఎస్-ఎస్.సుబ్బారావు పాల్గొన్నారు.

పీతల సుజాతకు సీటు దక్కేనా..!

ఆందోళనలో ఆమె అనుచరులు

ఉమ్మడి గోదావరి జిల్లాలో కేటాయించాలని కోరుతున్న వైనం

ప్రజాశక్తి - చింతలపూడి

గత 30 సంవత్సరాలుగా టిడిపిలోనే ఉంటూ, అధిష్టానం ఆదేశాలు తూచా తప్పకుండా పాటిస్తూ విధేయురాలిగా పేరు తెచ్చుకున్న మాజీ మంత్రి పీతల సుజాతకు చోటు ఎక్కడ అని ఆమె అనుచరులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2004లో అధిష్టానం టికెట్ ఇచ్చిందని, ˊనపై పెట్టుకున్న నమ్మకానికి విజయంతో బదులిచ్చిందని, 2014లో మరోసారి తనకు టికెట్ ఇవ్వగా మళ్లీ విజయ దుందుభి మోగించిందని చెప్పారు. 2019లో టికెట్ ఇవ్వకపోయినా పార్టీ ఆదేశాలకు కట్టుబడి ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా చింతలపూడి నియోజకవర్గంలో కార్యకర్తలతో తిరుగుతూ అండగా ఉన్నారని, 2019 నుంచి 2024 వరకు రాష్ట్రంలో ప్రతి చోటా ప్రతి నియోజకవర్గంలో తిరిగారని ఆమె అనుచరులు చెబుతున్నారు. యువ నాయకుడు నారా లోకేష్ నిర్వహించిన యువగళం పాదయాత్రలో ప్రతి జిల్లాలో ఆమె పాల్గొందని, నారా లోకేష్‌తో కలిసి పాదయాత్రలో పాల్గొందని చెబుతున్నారు. భీమవరంలో యువగళం పాదయాత్ర సమయంలో నారా లోకేష్‌పై దాడి జరిగినప్పుడు ఆమె అక్కడే ఉండి లోకేష్‌కు అండగా నిలిచారన్నారు. అమరావతి రైతులు పాదయాత్ర చేసిన సమయంలో రైతులతో పాటు పాదయాత్రలో పాల్గొన్నారని చెబుతున్నారు. టిడిపి నాయకులపై దాడులు చేసినప్పుడు ఎవరికి వారు భయపడే సమయంలో బయటకు వచ్చి తీవ్రంగా ఖండించినా సంఘటనలు కూడా అనేకంగా ఉన్నాయని ఆమె అనుచరులు చెప్పారు. ఆమెకు టిక్కెట్ ఇవ్వపోవడంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని పలువురు చెబుతున్నారు. ఉమ్మడి గోదావరి జిల్లాలో పీతల సుజాతకు టికెట్ కేటాయించాలని ఆమె అనుచరులు కోరుతున్నారు.

27న బిజెపి సభ

పాల్గొనున్న కేంద్ర రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రజాసంక్షేమాన్ని గాలికొదిలేసిందని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి విమర్శించారు. స్థానిక ఇండోర్ స్టేడియంలో ఈ నెల 27న బిజెపి ఆధ్వర్యంలో నిర్వహించనున్న బహిరంగ సభకు ముఖ్యఅతిధిగా కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ రానున్న నేపథ్యంలో సభ ఏర్పాట్లను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులను ముఖ్యమంత్రి జగన్ నవరత్నాలకు ఖర్చు పెట్టి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ఉంచడమే కాకుండా యువతను మద్యానికి బానిసలుగా చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పనితీరులో లోపాలను ప్రస్తావించిన వారిపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేసి భయాందోళనలకు గురిచేస్తున్నారన్నారు.


మాట్లాడుతున్న భవానిశంకరి

7 నుంచి బలివే తిరునాళ్లు

ప్రజాశక్తి - ముసునూరు

వచ్చే నెల 7 నుంచి పదో తేదీ వరకు జరిగే మహాశివరాత్రి ఉత్సవాలు అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా పూర్తి చేయాలని నూజివీడు రెవెన్యూ డివిజనల్ అధికారి భవానిశంకరి అన్నారు. మండలంలోని బలివేలో శివ పార్వతి మల్లికార్జునస్వామి రాజ రాజేశ్వరి దేవి ఆలయం వద్ద డివిజన్ స్థాయి తిరునాళ్లపై ఆలయ ఇఒ నల్లూరి సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 8, 9వ తేదీల్లో కళ్యాణ మహోత్సవం సందర్భంగా తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల నుంచి సుమారు రెండు లక్షల పైగా యాత్రికులు వచ్చే అవకాశం ఉందన్నారు. వారందరికీ ఎటువంటి అసౌకర్యం కలగకుండా సకల సౌకర్యాలు కల్పించేలా వాలంటీర్ వ్యవస్థను పెంచే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. తిరునాళ్లకు రెండు రోజులు ముందుగానే తమ్మిలేరు నీళ్ల జల్లు స్నానాల కోసం తీసుకురావాలని, రోడ్ల మరమ్మతులు నిర్వహించాలని ఆర్అండ్‌బి శాఖాధికారులను కోరారు. ఆ నాలుగు రోజులు జరిగే ఉత్సవాల సమయంలో పరిశుభ్రతపై ప్రాముఖ్యత కనబరిచి పంచాయతీ రాజ్, ఎంపిడిఒ కార్యాలయ అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరిచి ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, దొంగతనం వంటివి చోటు చేసుకోకుండా పోలీస్ వ్యవస్థ కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నూజివీడు డివిజన్ డిఎస్‌పి మురళీకృష్ణ, సిఐ బాల సురేష్, ఎంపిడిఒ చాగంటి పద్మావతి దేవి, పి.వాసు, సర్పంచి లావు ప్రవీణ సుధాకర్, ఆర్‌టిసి సిబ్బంది, ఫైర్ శాఖ, ఆర్అండ్‌బి అధికారులు, పంచాయతీరాజ్, పలు శాఖాధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వక్తలు

'పిఎం విశ్వకర్మ యోజన'పై అవగాహన

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో విశాఖపట్నం ఎంఎస్ఎంఇ డిఎఫ్ఒ డాక్టర్ కెఎల్ఎస్.రెడ్డి సహకారంతో ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంపై ఒకరోజు సెమినార్, అవగాహన కార్యక్రమం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశం హాలులో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, డిపిఒ టి.శ్రీనివాస్‌విశ్వనాథ్, బిసి కార్పొరేషన్ ఇడి ఎన్ పుష్పలత, ఎల్‌డిఎం డి.నీలాద్రి, విశ్వకర్మ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ పాల్గొన్నారు. ఈ అవగాహన కార్యక్రమానికి 160 మంది హస్త కళాకారులు, అసోసియేషన్ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా పరిశ్రమల కేంద్రం జిఎం ఆదిశేషు, డిపిఒ టి.శ్రీనివాస్‌విశ్వనాథ్, ఇతర జిల్లా అధికారులు, ఎంఎస్ఎంఇ అధికారులు కళాకారులు లేవనెత్తిన ప్రశ్నలకు వివరణ ఇచ్చారు. జిల్లాలోని హస్తకళాకారులు, క్రాఫ్ట్ వ్యక్తులకు పూర్తి అవగహన కల్పించేందుకు ఈ కార్యక్రమం దోహదపడింది.

చెరకుకు రూ.5 వేలు మద్దతు ధర ప్రకటించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కేంద్రప్రభుత్వం 2024-25 చెరకు క్రషింగ్ సీజన్‌కు టన్ను చెరకుకు రూ.3,400 ఎఫ్ఆర్‌పి (ఫెయిర్ అండ్ రెమ్యూనరేటివ్ ప్రైస్) ధర ప్రకటించిందని, ఈ ధర చెరకు రైతులకు ఏ మాత్రం సరిపోదని, రూ.5 వేలు మద్దతు ధర ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక అన్నే భవనంలో చెరకు మద్దతు ధరపై ఆయన మాట్లాడారు. పెరిగిన ఉత్పత్తి ఖర్చులను పరిగణనలోకి తీసుకుని మద్దతు ధరను ప్రకటించలేదన్నారు. మద్దతు ధర నిర్ణయించడానికి ప్రాతిపదికగా ఉన్న రికవరీ శాతం 9.5ను 10.5కు పెంచి రైతులకు నష్టం చేశారన్నారు. కేంద్రప్రభుత్వం చెరకు మద్దతు ధర నిర్ణయం పున:పరిశీలించి రూ.5 వేలు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. మూతబడిన చెరకు ఫ్యాక్టరీలను తెరిపించాలని కోరారు.

నేరాలు - ఘోరాలు

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఇసుక అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ డి.దుర్గామహేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని బండివారిగూడెం గ్రామ శివార్లలోని ఎర్ర కాలువ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారం మేరకు గురువారం ఎస్ఐ దుర్గామహేశ్వరరావు తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బొర్రంపాలెంలో చోరీ

ప్రజాశక్తి - టి.నరసాపురం

బంగారం చోరీపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ డి.దుర్గామహేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని బొర్రంపాలెం గ్రామానికి చెందిన కొనకళ్ల అచ్యుతరావు తన ఇంట్లో సూట్ కేసులో పెట్టిన ఆరు కాసుల బంగారపు హారం ఈ నెల 12వ తేదీన చూసుకోగా కనిపించలేదు. దీంతో అదే గ్రామానికి చెందిన దొడ్డా సత్యనారాయణపై అనుమానం ఉందని అచ్యుతరావు పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం నమోదైన రెండు వేర్వేరు కేసుల్లో ఒకరు చనిపోగా, మరొకరు గాయాలపాలయ్యారు. భీమడోలు ఎస్ఐ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం... భీమడోలు గ్రామానికి చెందిన కాపల్లి కుసుమ హరనాథ వెంకటరాజు(63) లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. ఈ క్రమంలో అనారోగ్యంతో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురైన ఆయన ఈ నెల 17వ తేదీన ఇంట్లో ఉన్న గడ్డి మందును తాగారు. ఇది గమనించిన ఆయన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. ఆయన భార్య ఫిర్యాదు మేరకు భీమడోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వేరొక సంఘటనలో హైదరాబాదుకు చెందిన గడ్డం సాయితేజ, శ్రావణి దంపతులు అలంపురం గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చారు. అక్కడ నుంచి బంధువుల మోటార్‌సైకిల్‌పై బుధవారం ద్వారకాతిరుమల దేవస్థానానికి బయలుదేరారు. మార్గమధ్యంలో జాతీయ రహదారిపై ఉన్న భీమడోలు కనకదుర్గ దేవాలయం సమీపంలో వారు ప్రయాణిస్తున్న మోటారుసైకిల్‌ను వెనుక నుంచి వస్తున్న ట్రక్కు ఢీకొట్టింది. డ్రైవర్ నిర్లక్ష్యంగా వ్యవహరించిన కారణంగా ప్రమాదం చోటు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన శ్రావణిని చికిత్స నిమిత్తం ఏలూరు వైద్యశాలకు తరలించారు. ఆమె భర్త ఫిర్యాదు మేరకు భీమడోలు పోలీసులు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ భవనాలు.. పూర్తి కాని నిర్మాణాలు

మధ్యలోనే ఆగిపోయిన ఆర్‌బికె, సచివాలయాలు

హెల్త్ సెంటర్లకు సరిపోని నిధులు

అధికారుల తీరుపై ప్రజల విమర్శలు

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని పలు గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, హెల్త్ వెల్‌నెస్ సెంటర్ భవనాల నిర్మాణాలు మధ్యలోనే ఆగిపోయాయి. దీంతో అధికారుల తీరుపై ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. సిఎం జగన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామాల్లో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ సెంటర్లు నిర్మించి సామాన్యులకు అన్నీ అందుబాటులోకి తీసుకొస్తుంటే అధికారుల తీరుతో అవి వెనక్కి పోతున్నాయని ప్రజలు విమర్శిస్తున్నారు.



ముసునూరులో సగంలో ఆగిపోయిన రైతు భరోసా కేంద్రం

ప్రతి పనికి మండల స్థాయికి వెళ్లకుండా గ్రామ స్థాయిలో ఆయా కార్యాలయాల్లో తమ పనిని పూర్తి చేసుకునేలా నూతన భవనాలు నిర్మించడానికి నిధులు మంజూరు చేసి, గ్రామాలను అభివృద్ధి చేయడానికి ఎంతో కృషి చేస్తుంటే అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ పట్టించుకోకపోవడంతో నిర్మాణాలు సగంలో ఆగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల స్థాయిలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ సిబ్బంది, వారికి తోడు గ్రామ సచివాలయ స్థాయిలో ఇంజినీరింగ్ సిబ్బంది ఉండి కూడా ఇలా సగంలో కట్టడాలు ఆగిపోవడంతో రాజకీయ నాయకులు కూడా తాము చెప్పిన పనులు చేయడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. మంగల స్థాయి అధికారులు తాము చెప్పిన పనులు చేయడం లేదని, కనీసం మా ఫోన్ నెంబర్లు కూడా వారి వద్ద ఉండడంలేదని, ఏమైనా సమస్యలపై ఫోన్ చేసినప్పుడు ఎవరూ మీరు అంటూ అడగడం బాధాకరమని జెడ్‌పిటిసి సభ్యులు ప్రతాప్ ఇటీవల జరిగిన మండల సమావేశంలో చెప్పడం అధికారుల తీరు స్పష్టం కనిపిస్తుందని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇక సామాన్యుల పరిస్థితి ఏంటని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు జరిగే సమయం కావడంతో సిఎం జగన్ ఎన్నో పథకాలతో పాటు నూతన కార్యాలయాలు నిర్మాణానికి చర్యలు తీసుకుంటుంటే ప్రభుత్వ భవనాలను అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని గ్రామస్థాయి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భవనాలు పూర్తిస్థాయిలో నిర్మించకుండా సగంలో వదిలేయడంపై విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత మండల స్థాయి అధికారులు స్పందించి మండలంలోని 16 గ్రామాల్లో మిగిలిపోయిన రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్లు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరలోనే నిర్మాణాలు పూర్తి చేస్తాం

పంచాయతీరాజ్ ఎఇ ఆర్.దుర్గాప్రసాద్

మండలంలోని పలు గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ భవనాలను త్వరలోనే పూర్తి చేస్తాం. మండలంలోని 16 గ్రామాల్లో గ్రామ సచివాలయాలు 16కి మూడు మధ్యలో ఆగిపోయాయి. గోపవరం-2, ముసునూరు-1, వేల్పుచర్ల-1 నిర్మాణాలు మధ్యలో ఆగిపోయాయి. రైతు భరోసా కేంద్రాలు 16కి ఐదు మధ్యలో ఆగిపోయాయి. గోపవరం-1,2, గుళ్లపూడి-1, ముసునూరు-2, వేల్పుచర్ల-1 ఆగిపోయాయి. హెల్త్ సెంటర్లు 16కి 14 మధ్యలో ఆగిపోయాయి. లోపూడి, చెక్కపల్లిలో మాత్రమే ప్రారంభమయ్యాయి. హెల్త్ సెంటర్ల నిర్మాణానికి నిధులు సరిపోక ఆగిపోయాయి. సచివాలయం, రైతుభరోసా కేంద్రాల భవనాల నిర్మాణాలను త్వరలోనే పూర్తి చేస్తాం.


ఎంఎల్ఎకు పూలమాల వేస్తున్న ప్రజలు

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

ఎంఎల్ఎ డిఎన్ఆర్

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజలకు చేసిన సేవలను గుర్తించి మరోసారి జగనన్నను ఆశీర్వదించాలని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు కోరారు. మండలంలోని గురజ, పెనుమల్లి సంకర్షణపురం గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారంలో భాగంగా జరుగుతున్న ప్రజా ఆశీర్వాద యాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఎంఎల్ఎగా తనను, ఎంపీగా కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఆర్‌వివి.సత్యనారాయణ, వైస్ ఎంపిపిలు సునీత, రాధ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, ఎం.ఏసుబాబు, ఎం.వెంకటేశ్వరరావు, పి.సుబ్బారావు, మీసాల నాయుడు, సర్పంచి సరస్వతి, ఉప సర్పంచి కిరణ్మయి, పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'పొలాల్లో అశ్లీల ఫొటోలు తొలగించండి'

ప్రజాశక్తి - నూజివీడు

పొలాలకు దిష్టిబొమ్మలుగా అర్ధనగ్నంగా, అశ్లీలంగా ఉన్న సినిమా తారల ఫొటోల పెట్టారని, వాటిని తొలగించాలని అడ్వకేట్, ఐద్వా అధ్యక్షురాలు నండూరి పద్మాంజలి కోరారు. మండలంలోని పోతురెడ్డిపల్లి వెళ్లే దారిలో ఉన్న పొలాలకు దిష్టి బొమ్మలుగా అర్ధ నగ్నంగా, అశ్లీలంగా ఉన్న సినిమా తారల ఫొటోలు పెట్టారని చెప్పారు. చాలా చోట్ల పొలాల్లో కూడా ఈ విధంగా మహిళల అశ్లీల బొమ్మలు పెడుతున్నారన్నారు. పోలీసు అధికారులు ఆ బొమ్మలను తొలగించి, సంబంధిత రైతులకు, వ్యక్తులకు కఠిన ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

కౌలు రైతుల సమస్యలు మేనిఫెస్టోలో చేర్చాలి

ఏలూరు అర్బన్ :ఏప్రిల్‌లో జరగనున్న రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న రాజకీయ పార్టీలు తమ ఎన్నికల ప్రణాళికల్లో కౌలు రైతులకు సంబంధించిన సమస్యలను చేర్చాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం, రైతు సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో కౌలు రైతుల సమస్యలతో కూడిన 12 పేజీల బుక్‌లెట్‌ను రైతు, కౌలు రైతు సంఘాల నాయకులు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి డేగ ప్రభాకర్, జిల్లా కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు, ఏపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దొంత కృష్ణ, సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య మాట్లాడుతూ కౌలు రైతులను గుర్తించడంలో, వారిని ఆదుకోవడంలో ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పంట రుణాలు ఇవ్వాలని కోరారు. రానున్న ఐదేళ్ల కాలంలో కౌలు రైతులకు సంబంధించి సమస్యలు పరిష్కరిస్తామని ఎన్నికల్లో పోటీ చేస్తున్న రాజకీయ పార్టీలు తమ తమ ఎన్నికల ప్రణాళికల్లో చేర్చాలని డిమాండ్ చేశారు.


పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

చింతలపూడి నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి దుర్గారావు

ప్రగడవరంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రతి పేదవానికీ మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతోనే వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు చింతలపూడి నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి వెంప దుర్గారావు అన్నారు. మండలంలోని ప్రగడవరం గ్రామంలో చింతలపూడి నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి వెంప దుర్గారావు ఆధ్వర్యంలో ఆశ్రమ హాస్పటల్ వారు గురువారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో జనరల్ మెడిసిన్, ఆర్థోపెటిక్, గైనకాలజీ, ఇఎన్‌టి, ఆప్తమాలజీ డాక్టర్లు 398 మంది రోగులకు వైద్య సేవలందించారు. ఉచితంగా మందులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ అవసరమైనవారికి ఆశ్రమ హాస్పిటల్ వారు ఉచితంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించే విధంగా కృషి చేస్తానని తెలిపారు. ఈ ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించిన ఆశ్రమం హాస్పిటల్ వారికి, వెంప దుర్గారావుకు ప్రగడవరం పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.


రోగులకు మందులు అందిస్తున్న వైద్యులు

అక్రమ మట్టి తవ్వకాలు నిలిపివేయాలి

తహశీల్దార్ ఉదయ్‌కు గంటా సతీష్ వినతి

ప్రజాశక్తి - టి.నరసాపురం

చింతలపూడి ఎత్తిపోతల పథకం కాలువ గట్టుపై పుట్రేపు, కృష్ణాపురంలో గ్రీన్ ఫీల్డ్ హైవే కాంట్రాక్టర్లు జెసిబిలతో చేస్తున్న మట్టి తవ్వకాలు నిలిపివేయాలని తెలుగు రైతు మండల మాజీ అధ్యక్షుడు గంటా సతీష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ ఉదయ్‌కు ఆయన గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని కృష్ణాపురం, పుట్రేపు గ్రామాల సమీపంలోని చింతలపూడి ఎత్తిపోతల పథకం కాలువ గట్టు మట్టిని ఎటువంటి అనుమతులు లేకుండా కొన్ని నెలలుగా గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం పేరుతో కొందరు కాంట్రాక్టర్లు జెసిబిలతో తవ్వకాలు చేస్తూ లారీలతో మట్టిని తరలిస్తున్నారని తెలిపారు. టిడిపి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చింతలపూడి ఎత్తిపోతల పథకం కాలువ గట్టుపై మట్టి తవ్వి తరలించడం వల్ల గట్టు నాణ్యత తగ్గే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కాలువ నిర్మాణం పూర్తయితే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఎంతో ప్రాధాన్యం గల చింతలపూడి ఎత్తిపోతల పథకం కాలువ గట్టును అక్రమంగా తవ్వేస్తున్నారని, వెంటనే తవ్వకాలు నిలిపివేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.


తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సతీష్

అటవీ శాఖ ఉద్యోగులకు శిక్షణ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ రాజమండ్రి శిక్షణ శిబిరం నుంచి అటవీ శాఖ సెక్షన్ అధికారులకు, బీట్ అధికారులకు శిక్షణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని దర్భగూడెం బీట్ పరిధిలో, రమనక్కపేట విఎస్ఎస్ పరిధిలోని టేకు ప్లాంటేషన్‌ను గురువారం పరిశీలించినట్లు జంగారెడ్డిగూడెం సబ్ డిఎఫ్ఒ వెంకట సుబ్బయ్య తెలిపారు. ఈ సందర్భంగా ప్లాంటేషన్‌లో 2008లో టిస్యూ కల్చర్ ద్వారా నాటిన టేకు చెట్ల పెంపకం, వాటి ఎదుగుదలపై క్షేత్ర స్థాయిలో శిక్షణ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ శిక్షణకు మొత్తం 60 మంది వరకు సిబ్బంది హాజరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి రేంజ్ డిప్యూటీ డైరెక్టర్ రవిశంకర్, రేంజర్ ఎస్‌కె.వలీ, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మారేష్, అటవీ శాఖ సిబ్బంది రాఘవులు, రహమత్ పాల్గొన్నారు.


శిక్షణలో అటవీ శాఖ ఉద్యోగులు

చింతలపూడి ప్రజానీకం.. సమస్యలతో సతమతం

జనసేన నియోజకవర్గ కన్వీనర్ మేకా ఈశ్వరయ్య

ముగిసిన సామూహిక నిరాహార దీక్ష



మాట్లాడుతున్న మేకా ఈశ్వరయ్య


ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి మండల ప్రజలు ఐదేళ్లుగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని జనసేన పార్టీ నియోజకవర్గ కన్వీనర్ మేకా ఈశ్వరయ్య అన్నారు. సమస్యలపై పట్టణంలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద చేపట్టిన సామూహిక నిరాహార దీక్ష గురువారం రెండో రోజు ముగిసింది. ఈ దీక్షకు టిడిపి, బిజెపి నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మేకా ఈశ్వరయ్య మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి రాకముందు హామీలు ఇచ్చిన నామవరం సీతానగరం రోడ్డు నేటికీ వేయలేదన్నారు. చింతలపూడి నుంచి భట్టువారిగూడెం, బాలవారిగూడెం రోడ్డు ఇప్పటికీ పూర్తి చేయలేదన్నారు. చింతలపూడి-నాగిరెడ్డిగూడెం రోడ్డు అధ్వానంగా ఉందన్నారు. నగర పంచాయతీలో సెంట్రల్ లైటింగ్ గాలికొదిలేశారన్నారు. నగర పంచాయతీ అయిందని ప్రజలు సంతోషించారని, కాని అభివృద్ధికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చింతలపూడి నగర పంచాయతీలో డ్రెయినేజీలు, రోడ్లు అభివృద్ధి చేయాలన్నారు. జనసేన పార్టీ మండలాధ్యక్షులు మధుబాబు మాట్లాడుతూ వైసిపి హయాంలో చింతలపూడి నగర పంచాయతీలో అభివృద్ధిలో శూన్యమన్నారు. రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, కనీసం సెంట్రింగ్ లైటింగ్ కూడా లేదని చెప్పారు. రానున్న రోజుల్లో సమస్యలపై ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర పంచాయతీ అధ్యక్షులు పక్కాల వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ నాయకులు తూము విజయకుమార్, జనసేన పార్టీ కార్యకర్తలు, నాయకులు, వీర మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెంలో హనుమంతు వర్ధంతి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండల కేంద్రమైన కొయ్యలగూడెంలో సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో గురువారం కన్నెగంటి హనుమంతు 102వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర సమరయోధుడు హనుమంతుకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మేకల అన్నవరం, మంచాల వెంకయ్యనాయుడు, రామ్మోహన్, మేకల తేజ, సంకు మధుబాబు, కొట్టు ఏడుకొండలు, యాతం సత్యనారాయణ, విగ్గిన సూరిబాబు, నూకల రాము, పారేపల్లి శ్రీను పాల్గొన్నారు.


పురస్కారాలు అందిస్తున్న ఎంఎల్ఎ, మేయర్

వాలంటీర్లకు సేవా పురస్కారాలు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

స్థానిక ఫైర్‌స్టేషన్ సెంటర్ వద్ద ఉన్న డిసిఎంఎస్ కన్వెన్షన్ హాలులో గురువారం నిర్వహించిన వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా ఏలూరు నియోజకవర్గం 79 సచివాలయాల్లో ఉన్న 1495 మంది వాలంటీర్లకు అవార్డులు ప్రకటించారు. ఐదుగురికి సేవావజ్ర, 13 మందికి సేవారత్న, 1425 మందికి సేవా మిత్రా పురస్కారాలు అందించి సన్మానించారు. ప్రశంసపత్రం, మెడల్ అందించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎంఎల్ఎ ఆళ్ల నానితో పాటు నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, డెప్యూటీ మేయర్ సుధీర్ బాబు, వైసిపి నగర అధ్యక్షులు బొద్దని శ్రీనివాస్, కార్పొరేటర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పలుచోట్ల సీసీ రోడ్లు, డ్రెయిన్లు ప్రారంభం

ప్రజాశక్తి -ముదినేపల్లి

మండలంలోని పెనుమల్లి, గురజ, సంకర్షణపురంలో గ్రామాల్లో గడపగడపకూ మన ప్రభుత్వం నిధులతో నిర్మాణం పూర్తి చేసుకున్న సీసీ రోడ్లను, సీసీ డ్రెయిన్లను ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు గురువారం ప్రారంభించారు. అనంతరం గ్రామంలో వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పథకం ద్వారా వచ్చిన 300 మందికి యాజమాన్య ఆస్తి ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందించారు. గ్రామ ప్రజలు ఎంఎల్ఎ డిఎన్ఆర్‌కు వీధి వీధిన ఘన స్వాగతం పలుకుతూ పూల మాలలు వేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, పార్టీ మండలాధ్యక్షులు ఏసుబాబు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంట సంధ్య, వైస్ ఎంపిపిలు చొప్పర్ల సునీత, రాచూరి రాధ, రాష్ట్ర బిసి నాయకులు కోమటి విష్ణు, ఈడే వెంకటేశ్వరరావు, సర్పంచి ఫోరమ్ అధ్యక్షులు శీలం రామకృష్ణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ఏలూరు

మండలంలోని ఏలూరు డి4 సెక్షన్ పరిధిలో ఉన్న 33/11 కెవి చాటపర్రు సబ్ స్టేషన్, 33/11 కెవి గుడివాకలంక సబ్ స్టేషన్‌లో ఉన్న 33 కెవి లైన్ మరమ్మతులు చేయనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జెపిబి.నటరాజన్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మరమ్మతుల నేపథ్యంలో 23వ తేదీ శుక్రవారం ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు చాటపర్రు, గుడివాకలంక సబ్ స్టేషన్ పరిధిలోని చాటపర్రు, తిమ్మారావుగూడెం, కెడి.పురం, గుడివాకలంక, మొండికోడు, ప్రత్తికోళ్లలంక, పైడిచింతపాడు, కొక్కిరాయిలంక, కోమటిలంక, పెద్దయగిరిమిల్లి, చిన్నయగిరిమిల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

త్వరలో జనసేనలో చేరతా

మాజీ మంత్రి కొత్తపల్లి

ప్రజాశక్తి - నరసాపురం

త్వరలో తన అనుచరులతో కలిసి జనసేనలో చేరతానని మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు ప్రకటించారు. గురువారం తన ఇంటి వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తన సోదరుడు, మాజీ ఎంఎల్ఎ కొత్తపల్లి జానకీరామ్‌తో కలిసి మాట్లాడారు. స్వప్రయోజనాలు ఆశించకుండా రాష్ట్ర, దేశ భవిష్యత్తు కోసం ఆలోచించే, పవన్ కళ్యాణ్ ఆశయాలు నచ్చడంతో జనసేనలో చేరతానని చెప్పారు. గ్రామస్థాయి నుండి అంతర్జాతీయ స్థాయికి యువతకు ఆరాధ్య నాయకుడన్నారు. కార్యక్రమంలో వన్నెంరెడ్డి శ్రీను, గుగ్గిలపు మురళి, యర్రంశెట్టి బాబులు, అడ్డాల శ్రీను, దాసరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.